నీతో అవసరం లేకుండా
నిన్ను ఎవడు ఇష్టపడడు.
ఎందుకంటే స్వార్థం
మనిషి జన్మ హక్కు కాబట్టి..


# DD9 వార్త

తెలుగు దినపత్రిక

www.dd9vaartha.com | సంపుటి : 01 సంచిక : 172 | ఆదివారం, 08, ఫిబ్రవరి 2026 , | పేజీలు - 06 | వెల : 3/-


## గ్రూప్-1పై మళ్లీ సుప్రీంకోర్టుకు న్యాయపోరాటానికి నిరుద్యోగులు సిద్ధం

**హైదరాబాద్:** గ్రూప్-1 నియామకాలపై న్యాయ పోరాటానికి నిరుద్యోగులు సిద్ధమయ్యారు. మళ్లీ సుప్రీం కోర్టును ఆశ్రయించాలని నిర్ణయిం చారు. గ్రూప్-1పై హైకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. సింగిల్‌బెంచ్ తీర్పును సస్పెండ్ చేయడంతో ఇప్పటికే ఉద్యోగాలు పొందిన వారికి ఊరట లభించింది. హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పుపై న్యాయ నిపుణులను సంప్రదించి వీలైనంత త్వరగా సుప్రీం కోర్టులో కేసు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు అన్ని స్థాయిల్లోనూ పోరా టంగ్రూప్-1పై అభ్యర్థులు, నిరుద్యోగ జేఏసీ నేతలు పోరాటం చేస్తున్నారు. ఇప్పటికే ఒకసారి జీవో-29పై సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఆ తర్వా త ఫైనల్‌కీపై ఉన్నత న్యాయస్థానం తలుపులు తట్టారు. ఫైనల్ కీలో అనేక తప్పులున్నాయని, తమ అభ్యంతరాలను టీజీపీఎస్సీ పట్టించు లేదని, తమకు న్యాయం చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

# మున్సిపల్ ఎన్నికల్లో విజయం మాదే...

● మరో మూడేళ్లు అధికారంలో ఉండేది మేమే ● అభివృద్ధి చేస్తున్నాం..ఇంకా చేసి చూపిస్తాం ● వికారాబాద్, పరిగి, తాండూర్‌లకు గోదావరి నీళ్లు పారిస్తాం ● కేసిఆర్ కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలేశ్వరంగా మారింది ● బిజెపి, బిఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలను తిప్పికొట్టండి ● వికారబాద్ జిల్లా పర్యటనలో సిఎం రేవంత్ పిలుపు



**హైదరాబాద్,ఫిబ్రవరి 7 :** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో గెలిచేది మళ్లీ కాంగ్రెస్ పార్టీయేనని సిఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మీరిచ్చిన అధికారంతో అభివృద్ధి పనులు చేస్తున్నామని అంటూ..వికారాబాద్, తండూర్, పరిగి ప్రాంతాలకు గోదావరి జలాలను తరలిస్తామని అన్నారు. ఇందుకు మంత్రి శ్రీధర్ బాబే సాక్ష్యం అంటూ హామీ ఇచ్చారు. వికారాబాద్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా నారాయణపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతిబాట బహిరంగ సభ పాల్గొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంజూరైన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కేసీఆర్ తన స్వార్థం కోసం అటకెక్కించారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లాకు 3 టీఎంసీల గోదావరి జలాలను అందిస్తే లక్షలాది ఎకరాలు సాగులోకి వచ్చేవేనని, కానీ కేసీఆర్ నిర్లక్ష్యం వల్ల జిల్లా రైతాంగం బలైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ లక్ష కోట్లు వెచ్చించి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం మూడు ఏళ్లలోనే 'కూలేశ్వరం'గా మారిందని, ఆ ప్రాజెక్టు నిధులతో ఆయన కుటుంబ సభ్యులు ఫామ్ హౌసులు కట్టుకుని వ్యాపారాలు చేసుకున్నారని ఆరోపించారు. తాండూరు, పరిగి , వికారాబాద్ ప్రాంతాలను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేసే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.స్వయం సహాయక సంఘాల మహిళలకు సీఎం రేవంత్ రెడ్డి ఇందిరా మహిళా శక్తి చెక్కుల పంపిణీ చేశారు ఈ సందర్భంగా మిగతా2లో...



క్వాంటమ్ కంప్యూటింగ్‌కు

# కేంద్ర సహకారం

**టెక్నాలజీ అభివృద్ధిలో కీలకం కానుందన్న కేంద్రమంత్రి**

**అమరావతి,ఫిబ్రవరి 7 :** నేషనల్ క్వాంటమ్ మిషన్‌ను కేంద్రం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీకి సీఎం చంద్రబాబుతో కలిసి మిగతా2లో...

# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

**బస్తర్ జిల్లాలో లొంగిపోయిన 51మంది మావోలు**



**రాయపూర్,7 :** మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ జిల్లా బస్తర్ డివిజన్‌లో 51 మంది మావోయిస్టులు లొంగిపోయారు. మిగతా2లో...

# మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్ ఏర్పాటు

**కౌలాలంపూర్‌లో ప్రధాని మోడీ ప్రకటన**

**ఘనంగా స్వాగతం పలికిన ప్రవాస భారతీయులు**




**కౌలాలంపూర్,ఫిబ్రవరి 7 :** మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్ ఏర్పాటు చేయనున్నట్టు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. రెండ్రోజుల మలేసియా పర్యటన నిమత్తం శనివారంనాడు కౌలాలంపూర్ చేరుకున్న ఆయనకు మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం సాదర స్వాగతం పలికారు. భారతీయ సంప్రదాయ మిగతా2లో...

అణు ఒప్పందం కుదుర్చుకోవాల్సిందే..

# ఇరాన్‌పై ట్రంప్ ఒత్తిడి



**న్యూఢిల్లీ, 7 :** తమ దేశంతో అణు ఒప్పం దాన్ని కుదుర్చుకోవాల్సిందిగా ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి మిగతా2లో...

# విద్యతో పాటు సంస్కారం కూడా నేర్పండి

● పిల్లలను తీర్చిదిద్దే బాధ్యత విద్యాలయాలదే

● మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు



**విశాఖపట్నం,ఫిబ్రవరి 7 :** విద్యాసంస్థల్లో పిల్లలకు విద్యతో పాటు సంస్కా రాన్ని కూడా నేర్పించాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. పిల్లలను సంస్కారవంతులుగా తీర్చిదిద్దే బాధ్యత విద్యాలయాలపై ఉందన్నారు. చదువు అంటే కేవలం ఉద్యోగం సంపాదించడమే కాదని, సమాజానికి ఉపయోగపడే మంచి వ్యక్తులుగా విద్యార్థులు ఎదగాలని సూచించారు. అభివృద్ధి అంటే భవనాలు కట్టడం మాత్రమే కాదని, ప్రకృతిని కాపాడుకునే బాధ్యత కూడా అందరిపై ఉందన్నారు. పెందుర్తిలోని బాలాజీ హై ఫీల్డ్స్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మిగతా2లో...

# పోచారం కాంగ్రెస్‌లోకి ఎందుకెళ్లారు..?

- ప్రజలంతా ఆయనను నిలదీయాల్సిందే
- గతంలో తిట్టిన కాంగ్రెస్ పంచన చేరిన పోచారం
- అమలుకాని హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస
- బాన్సువాడ కార్నర్ మీటింగ్‌లో కెటిఆర్ విమర్శలు






# మున్సిపాలిటీలన్నీ మా ఖాతాలోకే...

**అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్‌కే ప్రజల మద్దతు**

**విపక్షాలు అభివృద్ధికి అడ్డం పడుతున్నాయి**

**మంత్రి పొన్నంతో కలసి మీడియా సమావేశంలో తుమ్మల**

**సిద్దిపేట,ఫిబ్రవరి 7 :**పంచాయితీ ఎన్నికల తరహాలోనే మున్సిపల్ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తామని, మెజార్టీ సీట్లను కాంగరెస్ గెలుచుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండు సంవత్సరాలుగా అసాధ్యమని భావించిన ఎన్నో సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరించిందని స్పష్టం చేశారు. కేవలం అసూయతోనే ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, ప్రజలు వారిని ఎప్పుడో తిరస్కరించారని ఆయన ఎద్దేవా చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వేదికగా జరిగిన మీడియా సమావేశంలోతుమ్మల నాగేశ్వర్ రావు ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పాల్గొన్న ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక నిర్ణయాలను మంత్రి తుమ్మల గుర్తు చేశారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా మిగతా2లో...

# ఎన్నాళ్లు కేంద్రాన్ని తిడుతూ పాలిస్తారు

● కెసిఆర్‌పై చర్యలు తీసుకుంటే అడ్డుకున్నదెవరు ● రేవంత్ తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి



**హైదరాబాద్,ఫిబ్రవరి 7 :** మాజీ సీఎం కేసీఆర్‌పై చర్యలు తీసుకుంటామంటే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎవరు అడ్డుకున్నారో చెప్పాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చర్యలు తీసుకోవాల్సింది సీఎం కాదా అని ప్రశ్నించారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రికి చేతగాక.. బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ తమ కు అవసరం అని చెప్పుకోవాలి మిగతా2లో...

# హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో భారీ అగ్నిప్రమాదం

● దట్టంగా అలముకున్న పొగతో ఉక్కిరిబిక్కిరి

● మంటలను ఆర్పిన ఐదు ఫైర్ ఇంజన్లు




**హైదరాబాద్,ఫిబ్రవరి 7 :** హైదరాబాద్ నగరంలోని నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ల్యాబ్ భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో దట్టమైన పొగ అలుము కుంది. సమాచారం అందుకున్న వెంటనే అగ్ని మాపక శాఖ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని, ఐదు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపుచేసారు. అయితే అత్యంత మిగతా2లో...

# మున్సిపల్ ఎన్నికల్లో విజయం మాదే...

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను, తప్పులను సరిదిద్దుకుంటూ తమ ప్రభుత్వం రాష్ట్ర ప్రగతి కోసం ముందుకు వెళుతోందని ఆయన స్పష్టం చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్, కేంద్రంలో పన్నెండేళ్లుగా ఉన్న మోదీ రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించిన ఆయన, బీజేపీ , బీఆర్ఎస్ పార్టీల మధ్య 'చీకటి ఒప్పందాలు' ఉన్నాయని సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీ కార్యకర్తలు తమ బీ-ఫామ్‌లను బీఆర్ఎస్ ఆఫీసుల నుండి తెచ్చుకుంటున్నారని ఎద్దేవా చేస్తూ, గల్లీలో పనిచేసే నాయకుడిని చూసి కాకుండా ఢిల్లీలో ఉండే పెళ్లి పెద్దను చూసి ఓట్లు వేయడం ఏమిటని ప్రజలను ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి పలు కీలక ప్రకటనలు చేశారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ భూసేకరణను త్వరలోనే పూర్తి చేసి, ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. మక్తల్, నారాయణపేట , కొడంగల్ నియోజకవర్గాలకు కృష్ణా జలాలను తరలించి 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పా జంక్షన్ నుండి మన్నెగూడ రోడ్డు పూర్తి కాకపోవడం వల్ల జరిగిన ప్రాణనష్టానికి కేసీఆర్, సబితా ఇంద్రారెడ్డిలే బాధ్యులని విమర్శించిన రేవంత్ రెడ్డి, ప్రస్తుతం కోర్టు కేసులను పరిష్కరించి ఆ రోడ్డు పనులను వేగవంతం చేశామని వెల్లడించారు. భవిష్యత్తులో రీజనల్ రింగ్ రోడ్డు , రేడియల్ రోడ్లు రాబోతున్నాయని, వికారాబాద్ త్వరలోనే ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ చరిత్రను తాను చెరిపేయాలని చూస్తున్నానని కేటీఆర్, హరీష్ రావు చేస్తున్న విమర్శలకు ముఖ్యమంత్రి ఘాటుగా స్పందించారు. కేసీఆర్ దొంగ పాస్‌పోర్టుల చరిత్ర, దొంగ నోట్ల వ్యవహారం , దళితుడిని సీఎం చేస్తానన్న దొంగ హామీల చరిత్ర తెలంగాణ ఉన్నంత కాలం చెరిగిపోదని, ఆ 'పాపాల భైరవుడి' చరిత్ర ప్రజలకు గుర్తుండేలా చేసే బాధ్యత తనదని ఆయన వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ లాంటి చిల్లర పనులకు నోటీసులు ఇవ్వక ఏం చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే 70 వేల ఉద్యోగాల భర్తీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ వంటి హామీలను అమలు చేశామని గుర్తు చేస్తూ, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో విషం చిమ్మే పాములకు మళ్ళీ పాలు పోయకుండా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రెండేళ్ల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

# పోచారం కాంగ్రెస్‌లోకి ఎందుకెళ్లారు

**కామారెడ్డి,ఫిబ్రవరి 7 :**కాంగ్రెస్ పార్టీలోకి పోచారం శ్రీనివాస్ రెడ్డి ఎందుకు పోయారో బాన్సువాడ ప్రజలకు సమాధానం చెప్పవలసిన అవసరం ఉందని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో తెలంగాణలో స్వర్ణయుగం నడిచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పేదల కోసం కేసీఆర్ అనేక పథకాలను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. కానీ అడ్డగోలు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కేటీఆర్ పాల్గొన్నారు. ముందుగా కొయ్యగుట్టలో అమర వీరుల స్తూపం వద్ద కేటీఆర్ నివాళులర్పించారు. కొయ్యగుట్ట నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్‌తో కలిసి ఆయన భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ పాల్గొన్నారు. కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ మాట్లాడుతూ .. పోచారం శ్రీనివాస్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డిని నమ్మి గెలిపిస్తే ఏం చేశాడని ప్రశ్నించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆయన తనయులు దోచుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి గతంలో అన్న విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఒక ఆంబోతు, రెండు దున్నపోతు లంటూ విమర్శించలేదా అని ప్రశ్నించారు. అయినప్పటికీ వెళ్లి రేవంత్ రెడ్డి పక్కకు చేరాడని విమర్శించారు. ఈ సందర్భంగా గతంలో పోచారం శ్రీనివాస్ రెడ్డిని రేవంత్ రెడ్డి తిట్టిన తిట్లను ఫోన్‌లో పెట్టి ప్రజలకు వినిపించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి బండ కట్టుకొని బాయిలో దుంకాలె అని మండిపడ్డారు. కాంగ్రెస్‌లోకి ఎందుకు వెళ్లారో పోచారం శ్రీనివాస్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని ఓటేసి గెలిపించిన పోచారం శ్రీనివాస్ రెడ్డిని గల్లా పట్టి అడగాలని సూచించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి బాన్సువాడ సిగ్గు తీసిందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని కేటీఆర్ అన్నారు. తామే బాన్సువాడను మున్సిపాలిటీ చేశామని గుర్తుచేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బాన్సువాడ నియోజకవర్గంలో 10వేల కోట్లతో అభివృద్ధి జరిగిందని వివరించారు. భవనాలు, ఆస్పత్రి, కులసంఘాల భవనాలకు రూ.500 కోట్లు ఇచ్చామని తెలిపారు. 42వేల మందికి ఆసరా పెన్షన్లు, 70 వేల మందికి రైతుబంధు, 14వేల మందికి రైతుబీమా ఇచ్చామని పేర్కొన్నారు. 15 వేల మందికి కల్యాణ లక్ష్మి, 30 వేల మందికి కేసీఆర్ కిట్లు అందించామని చెప్పారు. ఆ నిధులు అన్నీ కేసీఆర్ ఇచ్చిండని.. పోచారం పీకిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌లోకి వెళ్లాక ఒక్క రూపాయి కూడా పోచారం తీసుకురాలేదని విమర్శించారు. కాంగ్రెస్ నేతల మాటలు నమ్మొద్దని సూచించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డికి కేసీఆర్ ఏం అన్యాయం చేశాడని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి వేసే ఎంగిలి మెతుకులకు పోచారం ఎగిరెగిరి పడ్డాడని విమర్శించారు. బాన్సువాడ ప్రజలు గులాబీ జెండా ఎగురాలని అనుకుంటున్నారని అన్నారు. పోచారం లాంటి దొంగలకు సద్దులు కట్టింది చాలని కాంగ్రెస్ నాయకులకు హితవు పలికారు. కాంగ్రెసోళ్లు బంగారం ఇచ్చేవాళ్లు కాదు.. మెడలో పుస్తెలతాడు ఎత్తుకెళ్లే బ్యాచ్ అని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ నేతలు దండుపాళ్యం బ్యాచ్.. స్టువర్టుపురం దొంగలని ఎద్దేవా చేశారు. కొయ్యగుట్ట నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్‌తో కలిసి ఆయన భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చిందని.. వాటిలో ఒక్క హామీనైనా నెరవేర్చిందా అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో తులం బంగారం లేదు.. స్కూటీలు లేవు.. ఆరు గ్యారెంటీలు లేవని విమర్శించారు. రైతుబంధు లేదు.. రైతు భరోసా లేదని అన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని చెప్పి మోసం చేశారని అన్నారు. అసలు కాంగ్రెస్ చెప్పిన నాలుగు వేల పెన్షన్ ఎవరికైనా వస్తుందా అని ప్రశ్నించారు. ఫ్రీ బస్సు పేరుతో రేవంత్ రెడ్డి మహిళలను మోసం చేస్తున్నాడని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ మనిషి కాదు అని అన్నారు. మోదీ, రేవంత్ రెడ్డి ఇద్దరూ తోడు దొంగలని ఆరోపించారు. రేవంత్, ప్రధాని మోదీ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌నే గెలిపించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.రేవంత్ రెడ్డి ఏనాటికైనా బీజేపీ మనిషే, ఆయన కప్పుకున్న ముసుగు తొలగించి చూడాలని కేటీఆర్ ప్రజలను కోరారు. రేవంత్ ఏనాటికీ కాంగ్రెస్ మనిషి కాలేదని, ఆయన ముందు నుంచి బీజేపీ మనిషి అని, రేవంత్ ముమ్మాటికి బడే భాయ్ తమ్ముడు అని కేటీఆర్ అన్నారు.

# హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో భారీ అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

రద్దీగా ఉండే ఈ ఆప్రాంతంలో పక్కనే నీలోఫర్ ఆస్పత్రి కూడా ఉంది. ఆ ప్రాంతమంతా పొగలు కమ్ముకోవడంతో సహాయ చర్యలకు తీవ్ర అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. అగ్నిమాపక సిబ్బంది ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాంచారు. ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, ఘటనపై పూర్తి వివరాలను దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదు. పోలీసులు ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ, ఎవరినీ ల్యాబ్ లోపలికి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఈగా.. ఉదయం 10:00 గంటల ప్రాంతంలో మొదటి ఫ్లోర్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో మంటలు చెలరేగాయి. దీంతో ఆ ఫ్లోర్‌లోని కంప్యూటర్లు, ఫోరెన్సిక్ సంబంధిత కెమికల్స్‌తో సహా కీలకమైన పత్రాలు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో పలు ముఖ్యమైన కేసులకు సంబంధించిన ఫోరెన్సిక్ రిపోర్టులు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ మంటల్లో ఫోన్ ట్యాపింగ్‌కు కేసుకు సంబంధించిన హార్డ్ డిస్కులూ కాలిపోయినట్లు సమాచారం.నిమిషాల వ్యవధిలోనే మంటలు భవనంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించాయి. దీంతో లోపల ఉన్న కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి. అగ్నిప్రమాదం కారణంగా ఆ ప్రాంతమంతా దట్టంగా నల్లటి పొగ అలుముకుంది. ప్రమాదాన్ని గమనించిన కార్యాలయ సిబ్బంది ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. అగ్ని ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని ఐదు ఫైరిరజన్లతో మంటలనున అదుపులోకి తీసుకొచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని అధికారులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. కాగా, ప్రమాదం గురించి తెలియగానే నార్త్ జోన్ డీఐజీ శ్వేత, ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి ల్యాబ్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ల్యాబ్‌లో కీలకమైన కేసులు, ఫోరెన్సిక్ ఆధారాలకు సంబంధించిన డాక్యుమెంట్లు ఏవైనా దెబ్బతిన్నాయా అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. కాగా, ఈ అగ్ని ప్రమాదంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓటుకు నోటు కేసు సహా పలు కీలక కేసులకు సంబంధించిన డాక్యుమెంట్లు, ఎవిడెన్స్‌లు ఇక్కడే ఉండటంతో ఈ అగ్ని ప్రమాదం వెనుక కుట్ర కోణం ఉండొచ్చని అంటున్నారు.

# ఎన్నాళ్లు కేంద్రాన్ని తిడుతూ పాలిస్తారు

(మొదటి పేజీ తరువాయి)

కానీ.. కిషన్ రెడ్డి మీదనో, కేంద్ర ప్రభుత్వం మీదనో నిందలు వేయొద్దని హితవు పలికారు. కిషన్‌రెడ్డిని అడ్డుపెట్టి సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కువ రోజులు తప్పించుకోలేరన్నారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని ఏ ఒక్క రోజైనా రాహుల్‌గాంధీ.. రేవంత్ రెడ్డిని ఆదేశించారా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌పై చర్యలకు రాహుల్ గాంధీ అడ్డుపడకుంటే తక్షణమే చెప్పాలని డిమాండ్ చేశారు. మోదీని అడ్డుకోవడం కోసం సోనియా కుటుంబం, కేసీఆర్ కుటుంబం ఏకమయ్యాయని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. బీఆర్ఎస్, కాంగ్రెస్.. ఎవరు అధికారంలో ఉంటే వారు మజ్లిస్‌ను ప్రసన్నం చేసుకుంటున్నారని ఆరోపించారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు ఈ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తమను విమర్శించే ముందు సీఎం రేవంత్ ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. రేవంత్ తనను కల్వకుంట్ల కిషన్ రావు అని విమర్శించారని.. తానెలా కల్వకుంట్ల కిషన్ రావు అవుతాను? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబాన్ని కాపాడాల్సిన అవసరం తనకు ఎందుకుంటుందని నిలదీశారు. పనికిరాని, పసలేని ఆరోపణలు చేయడం రేవంత్ రెడ్డికి బాగా అలవాటైందని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. రేవంత్ చెత్త విమర్శలకు తాను చాలాసార్లు కౌంటరిచ్చానని అన్నారు. మళ్లీ మళ్లీ ఆయన పిచ్చి ప్రేలాపనలు చేయొద్దని.. ఈ విషయాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కేంద్రంపై అనవసరంగా మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి నాడు ఇందిరాగాంధీని గెలిపిస్తే.. ఆ జిల్లా ప్రజలకు, తెలంగాణకు ఆమె ఏం చేశారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక దేశంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని కిషన్ రెడ్డి వివరించారు. తమ ఎంపీలకు మోదీ సమ ప్రాధాన్యం ఇస్తారని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత కేంద్రం తెలంగాణకు ఏం చేసిందో చెబుతామని తెలిపారు. ఈ ఎన్నికల ప్రచారానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ వచ్చే అంశంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని కిషన్ రెడ్డి తెలిపారు.

## ఈఎన్‌సిగా రమేశ్ బాబు నియామకం

**హైదరాబాద్,ఫిబ్రవరి 7** ఎట్టకేలకు తెలంగాణ ప్రభుత్వం నీటిపారుదల శాఖ ఈఎన్సీని నియమించింది. గత నెలలో పదవీ విరమణ పొందిన అంజద్ హుస్సేన్ స్థానంలో ఓలేటి వెంకట రమేశ్ బాబును నియమించింది. ఈ మేరకు నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ నియమాకంపై ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వెంకట రమేశ్‌బాబుకు ఈఎన్సీగా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఆయన సూర్యాపేట, ఖమ్మం జిల్లాల చీఫ్ ఇంజినీర్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఇరిగేషన్‌లో ఈఎన్సీ(జనరల్) స్థానం అత్యంత కీలకం. గతంలో ఈ శాఖను 19 టెరిటోరియల్స్‌గా విభజించగా మైనర్, మీడియం, మేజర్ ప్రాజెక్టులన్నీ ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చి ఆయా చీఫ్ ఇంజి నీర్లకే బాధ్యతలను అప్పగించింది. అన్ని విభాగాలపై పూర్తిస్థాయి నిర్ణయాధికారాన్ని ఈఎన్సీకే కట్టబెట్టింది. ఇరిగేషన్ శాఖ, డ్యామ్ సేఫ్టీకి సంబంధించి రాష్ట్రస్థాయి కమిటీల్లోనూ ఈఎన్సీకే పూర్తి అధికారాలున్నాయి. ఇప్పటివరకు ఈఎన్సీగా పనిచేసిన అంజద్ హుస్సేన్ జనవరి 31న విరమణ పొందారు. సాధారణంగా కీలకమైన స్థానం ఖాళీ అవుతుంటే ముందుగానే తాత్కాలికంగానైనా ఇన్‌చార్జిని నియమించడం పరిపాటి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వారం రోజులైనా భర్తీ చేయకపోవడం ఇటీవల చర్చనీయాంశంగా మారింది. అయితే ఈఎన్సీ జనరల్ స్థానం భర్తీ కాకపోవడానికి ప్రధాన కారణం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ మధ్య పేచీనే కారణమనే చర్చ జోరుగా వినిపిస్తున్నది.

# క్వాంటమ్ కంప్యూటింగ్‌కు కేంద్ర సహకారం

(మొదటి పేజీ తరువాయి)

శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో జితేంద్రసింగ్ మాట్లాడారు.ఈ పునాది రాయి.. దేశ క్వాంటమ్ మిషన్‌కు మూలం కానుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏపీ త్వరగా అందిపుచ్చుకుంటోంది. డీప్ సీ మిషన్‌కు త్వరగా అనుమతులు ఇచ్చాం. 2024 తర్వాత ప్రతి చోటా క్వాంటమ్ టెక్నాలజీ పదమే వినిపిస్తోంది. క్వాంటమ్ కంప్యూటింగ్ ద్వారా వైద్యరంగంలో పెను మార్పులు వస్తాయి. క్వాంటమ్ మిషన్ అన్ని రంగాల్లో కీలకం కానుంది. అందుకే నేషనల్ క్వాంటమ్ మిషన్‌కు రూ.6వేల కోట్లు కేటాయించాం అని కేంద్రమంత్రి వివరించారు. ఆవిష్కరణ సమయంలో అన్నీ చిన్నగానే కనిపిస్తాయి. కొన్నాళ్ల తర్వాత తెలుస్తుంది ఆ ఆవిష్కరణల విలువ ఏమిటో అని అన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్.. కమ్యూనికేషన్‌లోనూ కీలక మార్పులు తేనుందని కేంద్రమంత్రి తెలిపారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్రమంత్రులు నారా లోకేశ్, నారాయణ, కందుల దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

వీరిపై రూ.1.61 కోట్ల రివార్డు ఉంది. వీరంతా బస్తర్ ఎస్పీ జితేందర్ యాదవ్ సమక్షంలో శనివారంనాడు లొంగిపోయారు. బస్తర్ జిల్లా ప్రధాన కార్యాలయమైన జగదల్‌పూర్‌లో బస్తర్ పాండుమ్ 2026 ఫెస్టివల్ ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర మంత్రి అమిత్‌షా రాయపూర్ వచ్చిన రోజునే ఇంత పెద్దసంఖ్యలో మావోయిస్టులు లొంగిపోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. జిజాపూర్ జిల్లాలో 20 మంది మహిళా క్యాడర్‌తో సహా 30 మంది మావోయిస్టులు లొంగిపోయారని, మరో 21 మంది సుక్మా జిల్లాలో లొంగిపోయారని ఎస్పీ సుందరరాజ్ తెలిపారు. వీరిలో 14 మంది మహిళా క్యాడర్ ఉన్నారని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టుల నుంచి కా÷-దగ్గ÷క్స్ వైర్లు, జెలటిన్ స్టిక్‌లో స్వాధీనం చేసుకున్నామన్నారు. లొంగిపోయిన ప్రతి మావోయిస్టుకు 50 వేల తక్షణ ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పునరావాస చర్యలతో స్వచ్ఛందంగా వీరంతా లొంగిపోయినట్టు చెప్పారు. కాగా, తక్కిన మావోయిస్టు క్యాడర్ కూడా హింసను విడనాడి జనజీవన స్రవంతిలో కలవాలని, వారికి భద్రత, గౌరవంగా జీవించేందుకు అవసరమైన పునరావసం కల్పిస్తామని సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ కోరారు.

# మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్ ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

నృత్యాలతో ప్రవాస భారతీయులు ఆహ్వానం పలికారు. అనంతరం కౌలాలంపూర్ లోని భారత సంతతి ప్రజలతో ఆత్మీయ సమ్మేళనంలో మోదీ పాల్గొన్నారు. భారత్ పదేళ్లలో వేగంగా సాధిస్తున్న ప్రగతిని ఈ సందర్భంగా మోదీ వివరిస్తూ, పదేళ్ల క్రితం 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారతదేశం ప్రస్తుతం మూడో స్థానానికి చేరిందన్నారు. ఇండియాలో చదువుకునే విద్యార్థులకు త్వరలోనే తిరువళ్లువర్ స్కాలర్‌షిప్‌లు ఇస్తామని చెప్పారు. యూకే, యూఏఈ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఒమన్, ఈయూ, అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుందని, విశ్వాసం భారతదేశపు బలమైన కరెన్సీగా మారిందని పేర్కొన్నారు. ఇండియాను ఒక పెద్ద మార్కెట్‌గానే గతంలో చూసేవారని, ఇప్పుడు పెట్టుబడులు, వాణిజ్యానికి హబ్‌గా మారిందని మోదీ తెలిపారు. అభివృద్ధికి విశ్వసనీయమైన భాగస్వామిగా భారత్ నిలుస్తోందన్నారు. యూకే, యూఏఓ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఒమన్, ఈయూ, యూఎస్ఏ సహా అనేక దేశాలు ఇండియాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నాయని చెప్పారు. మలేసియాను ప్రపంచం లోనే అతిపెద్ద భారతీయ ప్రవాస జనాభాను కలిగిన రెండో దేశంగా మోదీ పేర్కొన్నారు. భారత్-మలేసియా ప్రజల హృదయాలను కలుపుతూ, రెండు దేశాల మధ్య వారధిగా ప్రవాస భారతీయులు నిలుస్తున్నారని ప్రశంసించారు. ఆహారపు అలవాట్లు, భాషా పరంగా ఎన్నో ఇరుదేశాల ప్రజల మధ్య ఎన్నో సామీప్యాలు ఉన్నాయని అన్నారు. భారతీయ సంగీతం, చలనచిత్రాలకు మలేసియాలో ఎంతో ఆదరణ ఉన్నట్టు విన్నానని, ప్రధాని అన్వర్ ఇబ్రహీం కూడా బాగా పాడతారనే విషయం ఇక్కడి వారందిరికీ తెలిసిందేనని అన్నారు. భారత్‌కు తిరిగి వచ్చిన చాలామందికి ఈ విషయం తెలియదని, తాను గత పర్యటనలో ఆశ్చర్యానికి గురయ్యానని చెప్పారు. ఇండియాలోని పాపులర్ హిందీ గీతాలను అన్వర్ ఇబ్రహీం ఆలపిస్తున్న వీడియోలు వైరల్ అయ్యాయని, లెజెండ్రీ ఎంజీఆర్ తమిళ పాటలను ఆయన బాగా ఇష్టపడతారని అన్నారు. దీనికి ముందు, భారత్‌కు చెందిన 800 మందికి పైగా నృత్యకారులు ప్రధానికి విమానాశ్రయం వద్ద స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్ట్ నుంచి మోదీ, అన్వర్ ఇబ్రహీం కలిసి ఒకే కారులో ప్రయాణించారు. భారత సంతతి ఆత్మీయ సమ్మేళనం వద్ద 'భారత్ మాతా కీ జై', 'మోదీ, మోదీ' అనే నినాదాలతో ఆయనకు సాదర స్వాగతం లభించింది.

# అణు ఒప్పందం కుదుర్చుకోవాల్సిందే.. ఇరాన్‌పై ట్రంప్ ఒత్తిడి

(మొదటి పేజీ తరువాయి)

ఒత్తిడి చేశారు. అలా చేయకపోతే పర్యవసనాలు ఏమిటో ఇరాన్‌కు తెలుసునని పరోక్షంగా సైనిక చర్యను ఉద్దేశించి ట్రంప్ వ్యాఖ్యానించారు.ఒప్పందం కోసం మస్కట్‌లో ఇరాన్, అమెరికా చర్చలు జరుపుతున్న నేపథ్యంలో ట్రంప్ నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఓ భారీ నౌక ఇరాన్ వైపు కదులుతోందని శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ చెప్పారు. ప్రస్తుత చర్చలు సానుకూలంగానే ఉన్నట్లు ఆయన తెలిపారు. చర్చలపై ఇరాన్ దౌత్యవేత్త ఒకరు స్పందిస్తూ సానుకూలంగానే చర్చలు ప్రారంభమయ్యాయని ఆయన చెప్పారు.

# విద్యతో పాటు సంస్కారం కూడా నేర్పండి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం.. భారతదేశమని అన్నారు వెంకయ్యనాయుడు. ఈ మధ్యకాలంలో కొంతమంది నాయకులు విర్రవీగుతూ బూతులు తిడుతున్నారని విమర్శించారు. అలాంటి వారికి ప్రజలు పోలింగ్ బూత్‌లోనే తగిన సమాధానం చెప్పాలన్నారు. రాజకీయ నాయకులకు బూతులు మాట్లాడటం ఒక ఫ్యాషన్‌లా మారిపోయిందని మండిపడ్డారు. ఎంత ఎక్కువ బూతులు మాట్లాడితే అంత పబ్లిసిటీ వస్తుందని కొందరు భావిస్తున్నారని విమర్శించారు. రాజకీయ నాయకులు అందరికీ ఆదర్శంగా ఉండాలని మాజీ ఉపరాష్ట్రపతి సూచించారు. కార్యక్రమంలో పెందుర్తి శాసనసభ్యులు కంచికల రమేశ్ బాబు, విశాఖపట్నం మేయర్ పీల శ్రీనివాస్‌లతో పాల్గొన్నారు. ఇందులో భాగంగా స్కూల్ పిల్లలతో కొంతసేపు సరదాగా మాట్లాడిన మాజీ ఉపరాష్ట్రపతి.. ఆ తర్వాత స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు.

# మున్సిపాలిటీలన్నీ మా ఖాతాలోకే...

(మొదటి పేజీ తరువాయి)

బీసీ కులగణన చేపట్టిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన గర్వంగా ప్రకటించారు. తెలంగాణను ఆదర్శంగా తీసుకునే నేడు కేంద్ర ప్రభుత్వం కూడా తలవంచి కులగణన చేపట్టబోతోందని ఆయన పేర్కొన్నారు. అలాగే ఎస్సీ వర్గీకరణ విషయంలో దశాబ్దాల నాటి కల సాకారం చేస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ. 13,000 కోట్లు వెచ్చించి పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని ఆయన వెల్లడించారు. గత పదేళ్ల పాలనలో ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన వారే నేడు నీతులు మాట్లాడుతున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రైతాంగం, పేదలు, నిరుద్యోగులు సంతోషంగా ఉంటే ఓర్వలేక ప్రతిపక్షాలు కారుకూతలు కూస్తున్నాయి. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ , పంచాయతీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పని అయిపోయిందని ప్రచారం చేశారు, కానీ ప్రజలు తమ ఓటుతో మమ్మల్ని ఆశీర్వదించి వారికి బుద్ధి చెప్పారు' అని తుమ్మల గుర్తు చేశారు. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో కూడా అదే స్థాయిలో ప్రతిపక్షాల విమర్శలకు ప్రజలు సమాధానం చెబుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆశించిన స్థాయిలో సహకరించకపోయినప్పటికీ, అవసరమైతే తల తాకట్టు పెట్టయినా సరే అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల తేల్చి చెప్పారు.

# 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ

- కౌంటింగ్ ప్రక్రియను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించాలి : సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్






కామారెడ్డి, ఫిబ్రవరి 07(డిడి9 వార్త): 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్, అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్ పాల్గొని కౌంటింగ్ సిబ్బందికి కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. కౌంటింగ్ సమయంలో ప్రతి దశలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ విధులను నిబద్ధతతో, బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు మాస్టర్ ట్రైనర్లు తడ్వాయి శ్రీనివాస్, నర్సింగరావు ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన నిబంధనలు, విధి విధానాలు, చెక్‌లిస్టులు, వివిధ ఫారాలు, లెక్కింపు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సవివరంగా వివరించి కౌంటింగ్ సిబ్బందికి అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పూర్తి నిష్పక్షపాతత్వం, పారదర్శకతతో పాటు ఎన్నికల నియమావళిని కట్టుది ట్టంగా పాటించడం అత్యంత అవసరమని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేస్తూ, చిన్న తప్పిదానికైనా అవకాశం లేకుండా విధులు నిర్వర్తించాలని అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ సూపర్వైజర్లు, అసిస్టెంట్ సూపర్వైజర్లు ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి తమ బాధ్యతలను అత్యంత జాగ్రత్తగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, చట్టబ ద్ధంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అవ గాహన కౌంటింగ్ సిబ్బందికి కల్పించబడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత కౌంటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బీఆర్ఎస్ ప్రజలకు చేసింది శూన్యం

- ఎమ్మెల్సీ డా. చిన్నమైల అంజిరెడ్డి విమర్శలు





బిచ్కుంద, ఫిబ్రవరి 07(డిడి9 వార్త): కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు చేసింది ఏమీ లేదని ఎమ్మెల్సీ డా. చిన్నమైల అంజిరెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ఆదివారం కామారెడ్డి జిల్లా బిచ్కుందలో బీజేపీ అభ్యర్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇచ్చిన హామీల్లో ఒక్కదాన్నీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని అన్నారు. దీంతో అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. అలాగే పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కూడా ప్రజలకు చెప్పుకోదగిన అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి అండగా నిలుస్తారని, జిల్లాలో దాదాపు అన్ని స్థానాల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బిచ్కుందను పేరుకే మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారని విమర్శించిన ఆయన, స్థానికులు మౌలిక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సెంట్రల్ లైటింగ్, బస్సు స్టాండ్ వంటి కీలక పనులు సంవత్సరాలుగా పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపారు. అలాగే లెండి ప్రాజెక్టు పనులు 40 ఏళ్ల క్రితం ప్రారంభించినప్పటికీ నేటికీ పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేని పరిస్థితిలో ప్రజాప్రతినిధులు ఉన్నారని పేర్కొన్న ఆయన, తొలిసారి బిచ్కుంద మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బిచ్కుంద మండల పార్టీ అధ్యక్షులు శెట్టిపల్లి విష్ణు, మాజీ ఎమ్మెల్యే అరుణతారతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పోలింగ్ నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించాలి

- మైక్రో అబ్జర్వర్ల శిక్షణ తరగతుల్లో సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్







కామారెడ్డి, ఫిబ్రవరి 07(డిడి9 వార్త): ఎన్నికలలో కీలకమైన ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని మైక్రో అబ్జర్వర్లు నిశితంగా పరిశీలించాలని సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్ సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలు తు.చ తప్పకుండా అమలయ్యేలా, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆయన తెలిపారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో పోలింగ్ తీరుతెన్నులను సూక్ష్మ స్థాయిలో పరిశీలించేందుకు నియమించబడిన మైక్రో అబ్జర్వర్లకు శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో మధ్యాహ్నం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్‌తో పాటు అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ, మైక్రో అబ్జర్వర్లకు ఆయా ప్రాంతాల పోలింగ్ కేంద్రాలలో కీలక పరిశీలన బాధ్యతలు కేటాయించబడతాయని తెలిపారు. పోలింగ్‌కు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉంటేనే ఓటింగ్ ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించగలుగుతారని అన్నారు. ముఖ్యంగా పోలింగ్‌కు ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకుని పోలింగ్ సిబ్బందికి అందించే సామాగ్రి సక్రమంగా అందిందా లేదా పరిశీలించాలని సూచించారు. అలాగే పోలింగ్ సిబ్బందితో కలిసి పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడం, నిబంధనల ప్రకారం మాక్ పోలింగ్ నిర్వహించారా లేదా అన్నది గమనించాలని తెలిపారు. మాక్ పోలింగ్ అనంతరం చేపట్టే అసలు పోలింగ్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ఎన్నికల నిబంధనల మేరకు జరుగుతున్నదా లేదన్నది నిశితంగా పరిశీలించాలని సూచించారు. గమనించిన అంశాలను తక్షణమే జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలని, ప్రిసైడింగ్ అధికారి, సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఇతర పోలింగ్ సిబ్బంది విధులను గమనించాలని పేర్కొన్నారు. పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసే వరకు అన్ని అంశాలను పర్యవేక్షిస్తూ, ఓటింగ్ గోప్యతను కాపాడేలా మైక్రో అబ్జర్వర్లు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై మరింత ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అందించిన శిక్షణలో పేర్కొన్న అంశాలను సమగ్రంగా అవగాహన చేసుకుని విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. మాస్టర్ ట్రైనర్ తడ్వాయి శ్రీనివాస్ పోలింగ్ ప్రక్రియ, మైక్రో అబ్జర్వర్ల విధులు-- బాధ్యతలు, ప్రిసైడింగ్ అధికారులతో సమన్వయం, నివేదికల ప్రాధాన్యత తదితర అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి రాజు, లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ సాధ్యం





బీర్కూర్, ఫిబ్రవరి 07(డిడి9 వార్త) : సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలను సమర్థవంతంగా నియంత్రించవచ్చని బీర్కూర్ ఎస్సై మహేందర్ తెలిపారు. బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద గ్రామ భద్రతను మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ మేరకు సూచనలు చేశారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా చోరీలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చని చెప్పారు. సీసీ కెమెరాలు ఉండటం వల్ల నేరాలకు పాల్పడే వ్యక్తుల్లో భయం కలిగి, శాంతిభద్రతలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందిస్తూ, సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ముందుకు రావాలని ఎస్సై మాహేందర్ పిలుపునిచ్చారు. గ్రామ భద్రత అందరి బాధ్యత అని అన్నారు. ఈ సమావేశంలో గ్రామ కాంగ్రేస్ పార్టీ నాయకులు గోండ్ల శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ గోండ్ల రాజు, కాదెపురం గంగారాం, ఇందూరి లక్ష్మణ్, ఇందూరి గజేందర్, కుమ్మరి గంగారాం, మేత్రి నాగగొండ, బోయి లాలయ్య, కోమటి శివరాజ్, హవగిరి రావు, లింగప్ప, మెక్క సాయిలు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొని సీసీ కెమెరాల ఏర్పాటుకు తమ సహకారం అందిస్తామని తెలిపారు.

## బాన్సువాడలో కాంగ్రెస్ దూకుడు: నార్ల వసంత నందుకు భారీ మెజార్టీ ఖాయం



బాన్సువాడ, ఫిబ్రవరి 07(డిడి9 వార్త): బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర అగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 14వ వార్డు అభ్యర్థి నార్ల వసంత నందుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ ప్రజలను కలిసి కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పాలనలోనే సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, పట్టణ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు. ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని నాయకులు తెలిపారు.

## "మైండ్ స్పార్క్ సంస్థ "ద్వారా గిరిజన విద్యార్థులకు ల్యాప్ టాప్ ల అందజేత



బజార్ హత్నూర్, ఫిబ్రవరి 07 (డిడి9వార్త):-బజార్ హత్నూర్ మండల పరిధిలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల మాడగూడ లోని 6 గురు విద్యార్థులకు ఈఐమైండ్ స్పార్క్ టీం ఆరు ల్యాప్ ట్యాప్లను శనివారం రోజు అందజేశారు. పిల్లల వ్యక్తిగత చదువు వేగాన్నిబట్టి నేర్చుకునేసామర్థ్యాన్ని పెంపొందించే అడాప్టింగ్ లెర్నింగ్ విధానాన్ని మరింత ప్రభావంతం చేయడంలో భాగంగా ఈ ల్యాప్ ట్యాప్ లు సాయపడతాయని ప్రోగ్రాం కోఆర్డినేటర్ కిషోర్ తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం గ్రామీణ విద్యార్థులకు చేరవేసేలా సంస్థ కృషి చేస్తుందని ఆయనఅన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.సుదర్శన్, సిఐటి భగత్ వనిత పాఠశాల సిబ్బంది, "మైండ్ స్పార్క్ సంస్థ" సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల వేళ కూడా యథాతథంగా ప్రజావాణి అదనపు కలెక్టర్ విక్టర్



కామారెడ్డి, ఫిబ్రవరి 07(డిడి9 వార్త): మున్సిపల్ ఎన్నికల నేపథ్యం ఉన్నప్పటికీ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం యథాతథంగా కొనసాగుతుందని అదనపు కలెక్టర్ విక్టర్ తెలిపారు. 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నప్పటికీ, ప్రజల సమ స్యలు మరియు ఫిర్యాదుల స్వీకరణకు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రజావాణి కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులకు సంబంధించిన దరఖాస్తులను కలెక్టరేట్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉన్న రూమ్ నెంబర్ 25లో యథావిధిగా సమర్పించవచ్చని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలకు సత్వర పరిష్కారం అందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ విక్టర్ ఒక ప్రకటనలో కోరారు.

## యూరియా పంపిణీలో డిజిటల్ విధానం 8 నుంచి యాప్ ద్వారానే బుకింగ్

కామారెడ్డి, ఫిబ్రవరి 07(డిడి9 వార్త): తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ కామారెడ్డి జిల్లాలో ఆదివారం నుండి అందుబాటులోకి రానుంది. ఈ యాప్ ద్వారా రైతులు ఇకపై యూరియా కోసం క్యూలైన్లలో నిలబడాల్సిన అవసరం లేకుండా తమ స్మార్ట్‌ఫోన్ ద్వారానే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సౌకర్యం కల్పించబడింది. ఈ యాప్‌ను ఉపయోగించి బుక్ చేసుకోకుండా ఇకపై యూరియా సరఫరా చేయబడదని అధికారులు తెలిపారు. రైతులు గూగుల్ ప్లే స్టోర్ నుండి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ మరియు పట్టాదారు పాస్‌బుక్ వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అనంతరం జిల్లా, మండలం, పంట వివరాలు, సాగు విస్తీర్ణాన్ని నమోదు చేసి సమీపంలోని ఎరువుల డీలర్ వద్ద స్టాక్ లభ్యతను పరిశీలించి అవసరమైన యూరియాను బుక్ చేసుకోవచ్చు. బుక్ చేసుకున్న యూరియాను 24 గంటల లోపే కొనుగోలు చేయాల్సి ఉంటుంది, లేనిపక్షంలో బుకింగ్ స్వయంచాలకంగా రద్దు అవుతుందని అధికారులు స్పష్టం చేశారు. పట్టాదారులతో పాటు కౌలుదారులు కూడా ఈ యాప్‌ను వినియోగించుకోవచ్చని తెలిపారు. యాప్ వినియోగంలో ఏవైనా సమస్యలు ఎదురైతే సంబంధిత వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ యాప్ ద్వారా ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరగడంతో పాటు, రైతుల సమయం ఆదా అవుతుందని, ఎరువుల కొరత సమస్యను కూడా తగ్గించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

## సంగమేశ్వర కాలనీలో యువకుడి మృతి కలకలం



బాన్సువాడ, ఫిబ్రవరి 07(డిడి9 వార్త): బాన్సువాడ పట్టణ పరిధిలోని సంగమేశ్వర కాలనీ, రోడ్ నెంబర్--1లో నివాసం ఉంటున్న టాక్ సందీప్ (24) మృతి చెందిన ఘటన కలకలం రేపింది. మృతుడు మేస్త్రి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం రాత్రి సమయంలో ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడి ఉరివేసుకొనే ప్రయత్నం చేయడంతో కుటింబీకులు సముదాహించినట్లు కుటింబీకులు తెలిపారు. అనంతరం శనివారం తెల్లవారుజామున సుమారు 3.30 గంటల సమయంలో ఇంటి బయట రేకుల షెడ్డులో మృతిచెందినట్లు అతని అమ్మమ్మ గుర్తించినట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతుని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతికి గల కారణాలపై పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడవుతాయని పోలీసులు తెలిపారు.

## మొగలాన్ పల్లి తండా వాసి అదృశ్యం



**బాన్సువాడ, ఫిబ్రవరి 07(డిడి9 వార్త):** బాన్సువాడ మండలం మొగలంపల్లి తండా గ్రామానికి చెందిన శ్రావణ్ అదృశ్యమైన ఘటన స్థానికంగా ఆందోళనకు గురిచేస్తోంది. ఈ మేరకు ఆయన కుమారుడు దేవసోత్ దేవరాజ్ (27) బాన్సువాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రకారం, గురువారం రోజున శ్రావణ్ ఇంట్లో అకారణంగా గొడవ పెట్టుకొని బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని తెలిపారు. కుటుంబ సభ్యులు గ్రామంలో, బంధువులు, స్నేహితుల వద్ద విచారణ చేపట్టిన ప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లభించలేదని పేర్కొన్నారు. అదృశ్యమైన సమయంలో శ్రావణ్ తెలుపు రంగు దోతి, షర్ట్ ధరించి ఉండి, శరీరాకృతి సన్నగా ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి గాలింపు చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. సంబంధిత సమాచారం ఎవరైనా తెలిసినట్లయితే బాన్సువాడ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

## హోలీ పండుగపై చంద్రగ్రహణం ప్రభావం..



**బజార్ హత్నూర్, ఫిబ్రవరి 07(డిడి9వార్త):-** హోలీ 2026 తేదీపైదేశవ్యాప్తంగా గందరగోళం నెలకొంది. దీనికి ప్రధాన కారణం మార్చి 3న చంద్రగ్రహణం కారణంగా, కామ దహనం, హోలీ తేదీల విషయంలో భిన్న భిప్రాయా లువినిపిస్తున్నాయి. చంద్రగ్రహణం, సూతక కాలం కారణంగా మార్చి 3న రంగుల పండుగ నిర్వహించడం శాస్త్రపరంగా సముచితం కాదని పండితులు చెబు తున్నారు. అందుకే దేశవ్యాప్తంగా మార్చి 4, 2026 (చైత్ర కృష్ణ పక్ష ప్రతిపద)న హోలీ జరుపుకోవాలని అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం ఇంకా ఏలాంటి నిర్ణయం తీసుకోలేదు.


## సీఎం కప్ క్రీడోత్సవాల్లో రెండో స్థానంలో నిలిచిన పోతంగల్ మండల కబడ్డీ ఆటగాళ్లు




**కోటగిరి / పోతంగల్, ఫిబ్రవరి 07 (డీడీ9 వార్త):** నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో శనివారం మండల స్థాయి సీఎం కప్ క్రీడోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ క్రీడోత్సవాల్లో పోతంగల్ మండల కేంద్రానికి చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా, పోటాపోటీగా పాల్గొన్నారు. ముఖ్యంగా కబడ్డీ పోటీల్లో పోతంగల్ మండల జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి రెండో స్థానంలో నిలిచి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా క్రీడాకారులు మాట్లాడుతూ గెలుపు--ఓటములు క్రీడల్లో సహజమని, అయితే గెలుపే లక్ష్యంగా ప్రతి క్రీడాకారుడు తన నైపుణ్యాన్ని మరింత మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం కప్ పోటీల్లో మంచి స్థానం సాధించడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులు, నిర్వాహకులు తదితరులు పాల్గొని క్రీడోత్సవాలను విజయవంతం చేశారు.

## హంగర్గా ఫారంలో ఘనంగా 128వ రమాబాయి జయంతి





**పోతంగల్, ఫిబ్రవరి 07 (డీడీ9 వార్త):** నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలంలోని హంగర్గా ఫారం గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సతీమణి రమాబాయి 128వ జయంతి ఉత్సవాలను శనివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అంబేద్కర్, రమాబాయి దేశానికి చేసిన సేవలు ఎన్నటికీ మరిచిపోలేనివని అన్నారు. డాక్టర్ అంబేద్కర్ కేవలం దళితులకే కాకుండా, దేశంలోని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన చేసిన సేవలు జీవితకాలం గుర్తుండిపోతాయని తెలిపారు. ప్రతి సంవత్సరం అంబేద్కర్ జయంతి, రమాబాయి జయంతులను తమ గ్రామంలో అంగరంగ వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారిందని, వారి పట్ల ఉన్న అభిమానంతోనే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు..

## చక్రేశ్వరాలయ జాతర ఏర్పాట్లు ముమ్మరం

**- సబ్ కలెక్టర్‌కు ఆహ్వానం.. పోలీసు శాఖకు వినతి**



**బోధన్, నిజామాబాద్ జిల్లా,07 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** బోధన్ చారిత్రాత్మక శ్రీ చక్రేశ్వర శివ మందిరంలో ఈ ఏడాది మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరి ంచుకుని నిర్వహించ తలపెట్టిన జాతర ఉత్సవాల ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతు న్నా యని ఆలయ కార్యనిర్వహణాధికారి రాములు తెలిపారు. శనివారం ఆలయ కమిటీ ప్రతినిధులు సబ్ కలెక్టర్ వికాస్ మహతో ను కలిసి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేసి, అనంతరం పట్టణ సీఐ వెంకట నారాయణను కలిసి ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులకు ఆలయ అర్చకులు గణేష్ శర్మ, మహేష్ పాఠక్ వేదాశీర్వచనం అందించి, స్వామివారి శేష వస్త్రంతో ఘనంగా సన్మానించారు.

## బాన్సువాడ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున పోచారం భాస్కర్ రెడ్డి విస్తృత ప్రచారం







**బాన్సువాడ, ఫిబ్రవరి 07(డిడి9 వార్త):** బాన్సువాడ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా ఉమ్మడి నిజామాబాద్ డీసీసీబీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోచారం భాస్కర్ రెడ్డి బాన్సువాడ పట్టణంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా వార్డులలో ఇంటింటి ప్రచారం చేపట్టి కాంగ్రెస్ పార్టీ విధానాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బాన్సువాడ పట్టణంలోని 3వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి హకీమ్ ను, 4వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గైక్వాడ్ రుక్మిణిను, 18వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రేష్మా బేగం ఏజాజ్ ను మద్దతుగా ఆయా వార్డులలో పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు, పేదల సంక్షేమానికి తీసుకున్న నిర్ణయాలు, పట్టణ అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ముఖ్యంగా మహిళలు, యువత, కార్మికులు, పేద వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రజలకు కలిగిన లాభాలను వివరించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిస్తే ఆయా వార్డుల అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇచ్చి పనిచేస్తారని, మౌలిక వసతుల కల్పన, తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల అభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా పోచారం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయించిన కౌన్సిలర్ అభ్యర్థులకు ప్రజలు తమ అమూల్యమైన ఓటును చేతి గుర్తుకు వేసి, హకీమ్ ను, గైక్వాడ్ రుక్మిణిను, రేష్మా బేగం ఏజాజ్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే నాయకత్వం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ కార్యకర్తలు, యువజన విభాగం సభ్యులు, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

## గృహ గ్యాస్ సిలిండర్ల అక్రమ వినియోగంపై మెరుపు దాడులు 24 కేసులు నమోదు, 49 సిలిండర్లు స్వాధీనం








**కామారెడ్డి, ఫిబ్రవరి 07(డిడి9 వార్త):** కామారెడ్డి పట్టణం మరియు లింగంపేట ప్రాంతాల్లో గృహ వినియోగానికి కేటాయించిన ఎల్పీజీ సిలిండర్ల అక్రమ వినియోగంపై అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. శనివారం సహాయ పౌర సరఫరాల అధికారి మరియు డిప్యూటీ తహసీల్దార్ (సివిల్ సప్లైస్)లతో కూడిన రెండు ప్రత్యేక అమలు బృందాలు పలు వాణిజ్య సంస్థలను తనిఖీ చేశాయి. తనిఖీల సమయంలో పలు వ్యాపార సంస్థలు గృహ వినియోగానికి కేటాయించిన ఎల్పీజీ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు అక్రమంగా వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ఇది పెట్రోలియం ఉత్పత్తులు (సరఫరా మరియు పంపిణీ నియంత్రణ) కంట్రోల్ ఆర్డర్ నిబంధనలకు, అలాగే అత్యవసర వస్తువుల చట్టం--1955లోని సెక్షన్ 6ఏ కు విరుద్ధమని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో మొత్తం 24 కేసులు నమోదు చేసి, 49 గృహ ఎల్పీజీ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. గృహ గ్యాస్ సిలిండర్ల అక్రమ వినియోగం వల్ల ప్రభుత్వానికి ఆదాయ నష్టం కలగడమే కాకుండా ప్రజల భద్రతకు కూడా తీవ్రమైన ముప్పు ఏర్పడుతుందని అధికారులు హెచ్చరించారు. జిల్లాలో అవసర వస్తువుల అక్రమ మళ్లింపును అరికట్టేందుకు ఇలాంటి తనిఖీలు కొనసాగిస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

## సాగులో ఉన్న భూములకే రైతు భరోసా వచ్చే యాసంగి నుంచే కొత్త విధానం..

- వచ్చే యాసంగి నుంచే కొత్త విధానం.. శాటిలైట్ మ్యాపింగ్ ఆధారంగా సాయం
- సర్వే , గ్రౌండ్ ట్రూత్ వివరాలతో పెట్టుబడి సాయం ఇచ్చే యోచనలో సర్కారు
- వానాకాలం డేటానే ప్రామాణి
- కం.ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన సర్వే వివరాలు
- రాష్ట్రంలో ఉన్న పట్టా భూమి

లో 20 లక్షల ఎకరాల్లో సాగు తేడా త్వరలోనే

- ప్రభుత్వానికి అగ్రికల్చర్ వర్సిటీ తుది నివేదిక




**హైదరాబాద్, ఫిబ్రవరి (డిడి 9వార్త): -** రాష్ట్రంలో 'రైతు భరోసా' పంపిణీపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోబోతున్నది. ఇకపై పట్టా ఉన్న ప్రతి భూమికీ కాకుండా, వాస్తవంగా సాగులో ఉన్న భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందించాలని యోచి స్తున్నది. రాబోయే యాసంగి సీజన్ నుంచే ఈ కొత్త నిబం ధనలను అమలు చేసేందుకు కసరత్తు వేగవంతం చేసింది. వానాకాలం సీజన్‌లో జరిగిన సాగు వివరాలను ప్రాతిపదికగా తీసుకొని, అర్హులైన రైతులకు నగదు జమ చేయాలని భావిస్తున్నది. కేవలం కాగితాల్లో ఉన్న లెక్కలకే పరిమితం కాకుండా, ఆధునిక సాంకేతికతను ప్రభుత్వం రంగంలోకి దించింది. అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన శాటిలైట్ మ్యాపింగ్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయ్యింది. రాష్ట్రంలో ఉన్న పట్టాభూమిలో 8--12% సాగులో తేడా(20 లక్షల ఎకరాలు) కనిపిస్తున్నట్టు తేలింది.

శాటిలైట్ సర్వే వివరాలను సర్కారుకు అగ్రికల్చర్ యూనివర్సిటీ త్వరలోనే అందించనున్న నేపథ్యంలో ఈ డేటా కీలకంగా మారనున్నది. శాటిలైట్ ఆధారిత మ్యాపింగ్ ద్వారా సాగు భూములను గుర్తించడంతోపాటు గ్రౌండ్ లెవెల్‌లో పక్కాగా గుర్తించి, అర్హులకు మాత్రమే సాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నది. 20 లక్షల ఎకరాలు ఖాళీఅగ్రికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 10,600 రెవెన్యూ గ్రామాల్లో పంటల విస్తీర్ణం లెక్కలు పూర్తి చేశారు. విలేజ్ రెవెన్యూ మ్యాప్‌లు లేని 870గ్రామాలనుమినహాయించి మిగిలిన ప్రాంతాల్లో విశ్లేషణ పూర్తిచేశారు. రాష్ట్రంలో సాగుకు యోగ్యమైన మొత్తం భూమి 1.53 కోట్ల ఎకరాలు కాగా, ఇందులో 8 నుంచి 12 శాతం వరకు అంటే సుమారు 20 లక్షల ఎకరాలకు పైగా భూమిని పంటలు వేయకుండా ఖాళీగా ఉంచినట్టు సర్వేలో తేలింది. గత వానాకాలం పంటల విస్తీర్ణానికి సంబంధించిన పూర్తి నివేదిక త్వరలోనే ప్రభుత్వం చేతికి అందనున్నది. దేశంలోనే మొదటిసారిగా శాటిలైట్ ఆధారిత టెక్నాలజీతో పంటల విస్తీర్ణం లెక్కింపును చేపట్టగా.. నీటి లభ్యత తక్కువగా ఉన్న జిల్లాల్లో ఖాళీ భూముల శాతం అధికంగా ఉన్నట్టు తేలింది. ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో సాగునీటి సౌకర్యాలు తక్కువ కావడంతో అక్కడ ఖాళీ భూములు ఎక్కువగా కనిపిస్తున్నాయి. నీటి వసతి మెరుగ్గా ఉన్న జిల్లాల్లో సాగు చేయకుండా ఉంచిన భూములు తక్కువగా ఉన్నట్టు అధ్యయనంలో తేలింది. ఒక గ్రామంలో 500 ఎకరాల సాగు యోగ్య భూమి ఉంటే, 400 నుంచి 450 ఎకరాల్లో మాత్రమే పంటలు వేస్తున్నారని శాటిలైట్ ఇమేజెస్ స్పష్టం చేశాయి.

92 శాతం కచ్చితత్వంశాటిలైట్ సర్వేకు యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ఇమేజెస్‌ను ప్రతి 12 రోజులకు సేకరిస్తున్నారు. స్విట్జర్లాండ్‌కు చెందిన సార్ మ్యాప్ (ఎస్ఏఆర్ ఎంఏపీ) సంస్థతో ఒప్పందం చేసుకుని, ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా డేటాను విశ్లేషిస్తున్నారు. 4 నెలల పంట కాలంలో 10 సార్లు శాటిలైట్ ఇమేజెస్ ఆధారంగా విశ్లేషణ చేసి, 92 శాతం కచ్చితత్వాన్ని సాధిస్తున్నట్టు క్షేత్ర స్థాయి పరిశీలనల్లో తేలింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్లు, రిమోట్ సెన్సింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక సహకారంతో ఈ టెక్నాలజీని అమలు చేస్తున్నారు. మున్ముందు సొంతంగానే ఈ వ్యవస్థను నడపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**పంటల బీమా నుంచి పారదర్శకత వరకు.**

ఈ శాటిలైట్ మ్యాపింగ్‌తో పంట బీమా అమలులో రైతులకు నష్టపరిహారం సకాలంలో అందడమే కాకుండా, వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, కొనుగోళ్లు, అమ్మకాల్లో పారదర్శకత తీసుకురావడానికి ఉపయోగపడనుంది. ప్రభుత్వ పథకాలు అర్హులైన రైతులకే చేరేలా ఈ లెక్కలు సహాయపడతాయి. సాగు భూములను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడానికి క్షేత్ర స్థాయి అధికారులు విశ్లేషణ చేస్తారని అధికారులు చెప్తున్నారు. చీడపీడలు, వరదలు, తుఫానుల వల్ల జరిగే పంట నష్టాన్ని అంచనా వేయడానికి కూడా ఈ టెక్నాలజీని వినియోగిస్తారు.

**పైలెట్ ప్రాజెక్టు సక్సెస్.. రాష్ట్రవ్యాప్త అమలుకు సన్నాహాలు**


గతంలో పంటల నమోదు కోసం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం.. 20 జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా శాటిలైట్ సర్వే నిర్వహించింది. నిరుడు డిసెంబర్ 20 నుంచి 23 వరకు ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, ఖమ్మం, కొత్తగూడెం, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఈ సర్వే జరిగింది. 144 మండలాల్లోని 318 క్లస్టర్లలో ప్రక్రియ పూర్తి చేసి, సాగు భూములను కచ్చితంగా లెక్కించారు.


**ఇదివరకే నిర్ణయం**

సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతు భరోసా ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే నిర్ణయించింది. ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇప్పటికే స్పష్టం చేశారు. సాగు భూముల గుర్తింపు కోసం శాటిలైట్ సర్వే నిర్వహిస్తారని, గ్రామాల్లో సర్వే నంబర్లవారీగా ఏఈవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి కచ్చిత వివరాలు సేకరించి లోటుపాట్లు సరిచేస్తారని సమాచారం. అగ్రికల్చర్ యూనివర్సిటీ రూపొందించిన పంటల వివరాలను ఈనెల 14 తర్వాత సర్కారుకు అందిస్తే, టెక్నికల్ కమిటీలో చర్చించి దీనిపై నిర్ణయంతీసుకోనున్నది.

# కాంగ్రెసోళ్లు స్టువర్టుపురం దొంగలు ఓట్లు అడిగే హక్కు లేదు

- అబద్ధాల ప్రభుత్వానికి మున్సిపల్ ఎన్నికల్లో గట్టి బుద్ధి చెప్పాలి
- మున్సిపల్ మంత్రిగా బాన్సువాడకు మున్సిపాలిటీ హోదా కల్పించా : కేటీఆర్





**బాన్సువాడ, ఫిబ్రవరి 07(డిడి9 వార్త):**కాంగ్రెస్ నాయకులు స్టువర్టుపురం దొంగలని, వారికి ప్రజల వద్దకు వచ్చి ఓట్లు అడిగే హక్కు లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శనివారం బాన్సువాడ పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్ షోలో పాల్గొన్న ఆయన, అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు.మున్సిపల్ మంత్రిగా ఉన్న సమయంలోనే బాన్సువాడకు మున్సిపాలిటీ హోదా కల్పించానని కేటీఆర్ గుర్తు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఓడించేందుకు రేవంత్ రెడ్డి ప్రచారం చేశారని, ఇప్పుడు అదే ఇద్దరూ కలిసి ఒకటయ్యారని మండిపడ్డారు.ప్రాణం ఉన్నంత వరకు కేసీఆర్ వెంటే ఉంటానని చెప్పిన పోచారం, కాంగ్రెస్ గూటికి చేరి బీఆర్ఎస్ పార్టీకి వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధికి కేసీఆర్ రూ.10 వేల కోట్లు ఇచ్చారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా, ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా నెరవేర్చలేదని కేటీఆర్ దుయ్యబట్టారు. రూ.2000 పింఛన్‌ను రూ.4000 చేస్తామని చెప్పి మాట తప్పారని, ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. మహిళలకు మహాలక్ష్మి పథకం కింద రూ.2500 ఎప్పుడు ఇస్తారని నిలదీశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాల ప్రభుత్వమని ఆరోపించిన ఆయన, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గట్టి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా హామీలు నెరవేర్చకుండా ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడగడానికి వస్తున్నారని విమర్శించారు.
బాన్సువాడ నియోజకవర్గానికి 10 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక కేసీఆర్ కిట్లు కనుమరుగయ్యాయని, తులం బంగారం, బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుకలు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు.మున్సిపల్ ఎన్నికల్లో బాన్సువాడలో గులాబీ జెండా ఎగురవేయాలని ఓటర్లను కేటీఆర్ కోరారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు ఒకటేనని వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, అంజిరెడ్డి, జుబేర్, ధర్మతేజ, నార్ల రత్నకుమార్, ఎలమంచిలి శ్రీనివాసరావు, బోడ చందర్, మోచి గణేష్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# నేరస్తులకు శిక్ష పడేలా సమర్థవంతంగా పని చేయాలి

- కోర్టు డ్యూటీ సిబ్బంది సమీక్షలో పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య
- సాక్షులను సకాలంలో హాజరుపరచాలని ఆదేశం






**నిజామాబాద్ జిల్లా,07 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** కేసుల దర్యాప్తులో కోర్టు విధులు నిర్వహించే సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని, నేరస్తులకు శిక్షలు పడేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సూచించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో కోర్టు డ్యూటీ సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖ ప్రతిష్ఠ పెరగాలంటే కోర్టులో కేసుల విచారణ సజావుగా సాగాలని, అందుకు సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని కోరారు. ముఖ్యంగా కేసులకు సంబంధించిన సాక్షులను సకాలంలో న్యాయస్థానంలో ప్రవేశపెట్టడం ద్వారానే నేరస్తులకు శిక్షలు పడే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. విధుల్లో క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని, ప్రజలకు భద్రతతో పాటు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం సిబ్బంది యోగక్షేమాలను, వారికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సీసీఆర్బీ సీఐలు రమేష్, అంజయ్య, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ శ్యామ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ నెల 12న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి




**బోధన్, నిజామాబాద్ జిల్లా,07 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ స్థాయి సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు కోరారు. శనివారం ఎడపల్లి మండల కేంద్రంలోని అఖిల భారత ఐక్య రైతు సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు గుమ్ముల గంగాధర్, పుట్టి నడిపి నాగన్న మాట్లాడారు. 2014లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మోడీ సర్కారు కార్పొరేట్ వ్యాపారులకు కొమ్ముకాస్తూ సామాన్యులపై భారాలు మోపు తోందని నాయకులు విమర్శించారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం శ్రమజీవులకు ద్రోహం చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించేలా తెచ్చిన నూతన విద్యుత్, విత్తన చట్టాలను రద్దు చేయాలని, ఎంఎస్పీ కి చట్టబద్ధత కల్పించి, గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఆసరాగా నిలిచే ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలన్నారు. పని దినాలు తగ్గిపోవడంతో ఇబ్బందులు పడుతున్న బీడీ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో వామపక్ష, విద్యార్థి, యువజన సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోధన్ డివిజన్ నాయకులు కాషా రవి, సుల్తాన్ సాయిలు, శ్రీపతి మల్లేష్, పి.గోపాల్, వడ్డెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

# కార్యదర్శి వేధింపులకు బిల్ కలెక్టర్ బలి

- పన్నుల వసూళ్లలో అవమానమే ప్రాణసంకటం
- పురుగుల మందు తాగి బాబు ఆత్మహత్య
- బాధ్యులపై చర్యలకు భార్య డిమాండ్



**బోధన్, నిజామాబాద్ జిల్లా,07 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** తోటి ఉద్యోగి వేధింపులు ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. పన్నుల వసూళ్ల విషయంలో పంచాయతీ కార్యదర్శి పెట్టిన వేధింపులు భరించలేక ఓ బిల్ కలెక్టర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం...
కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం పోచారం గ్రామానికి చెందిన నీరుడి బాబు (38), నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని పెంటకుర్ద్ గ్రామంలో బిల్ కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉదయభాస్కర్ గత కొంతకాలంగా బాబును మానసిక వేధింపులకు గురిచేస్తున్నట్లు సమాచారం. గ్రామంలో వసూలు చేసిన ఇంటి పన్నుల విషయంలో లెక్కలు తేడాలు ఉన్నాయంటూ అందరి ముందు దూషించడమే కాకుండా, తన గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించేవారని మృతుడి భార్య కవిత ఆరోపించారు. వేధింపులు తాళలేక మనస్తాపానికి గురైన బాబు, ఈ నెల 5వ తేదీ ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయనను వెంటనే బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం రాత్రి ఆయన మృతి చెందారు. ఆత్మహత్యకు ముందు బాబు రాసిన లేఖ పోలీసులకు లభ్యమైంది. అందులో తన మరణానికి కార్యదర్శి ఉదయభాస్కర్ వేధింపులే కారణమని పేర్కొన్నట్లు తెలుస్తోంది. తన భర్త మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని భార్య కవిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# త్యాగమయి రమాబాయి సేవలు చిరస్మరణీయం



**బోధన్, నిజామాబాద్ జిల్లా,07 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సతీమణి, త్యాగమయి రమాబాయి అంబేద్కర్ జన్మదిన వేడుకలను శనివారం బోధన్ మండలంలోని ఖండ్ గాం గ్రామంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యువజన సంఘం నేతలు మాట్లాడుతూ.. బాబా సాహెబ్ సామాజిక విప్లవానికి రమాబాయి అందించిన సహకారం మరువలేనిదని కొనియాడారు. అంబేద్కర్ ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్ళినప్పుడు, ఆమె ఎన్నో కష్టాలను ఓర్చి ఆయనకు అండగా నిలిచారని గుర్తు చేశారు. సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ సాగించిన పోరాటంలో ఆమె త్యాగం వెలకట్టలేనిదని, నేటి తరానికి ఆమె జీవితం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# బీజేపీ నీ గెలిపించండి బీసీ బిడ్డను అధ్యక్షున్ని చేస్తాం

- యు సి ఎఫ్ నిధులతో అభివృద్ధి చేస్తాం
- కాగజ్ నగర్ సభలోఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంపీ జీ నగేష్





**బజార్ హత్నూర్, ఫిబ్రవరి 07(డిడి9వార్త):-** కాగజ్ నగర్ మున్సిపాలిటీలో బిజెపి బలపర్చినఅభ్యర్థులను గెలిపించండి బీసీ హిందువు బిడ్డను అధ్యక్షున్ని చేసి కేంద్రం ద్వారా యు సి ఎఫ్ నిధులతో అభివృద్ధి చేస్తామని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ అన్నారు. శనివారం రోజు కాగజ్ నగర్ లో స్థానిక శాసన సభ్యులు పాల్వాయి హరీష్ రావు అధ్యక్షతన నిర్వహించిన ప్రచార సభలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్తో కలసి ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. ఇన్నేళ్లు అన్ని పార్టీలపాలన చూశారని ఇప్పుడు ఒకసారి బీజేపీనీ గెలిపించి అవకాశం ఇస్తే వందల కోట్లతో పట్టణ అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలోమహారాష్ట్ర ముఖ్య మంత్రి దేవేంద్ర పద్నా వీస్,ఎమ్మెల్సీ మల్లికార్జున్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం ధోనీ, కాగజ్ నగర్ మున్సిపాలిటీ ఎన్నికల ఇంచార్జి వెంకట్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడుశ్రీనివాస్, ఆసిఫాబాద్ ఇంచార్జి కోట్నాక విజయ్, ఎక్స్ జెడ్పీటీ
సీ అరిగేలా నాగేశ్వర్ రావు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాటిపల్లి గంగాధర్ రావు, నారాయణ, కదం ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో పోలీసుల స్పెషల్ డ్రైవ్

**-97 మందిపై కేసులు, ముగ్గురికి జైలు**



**నిజామాబాద్ జిల్లా,07 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఈనెల 2 నుండి 6వ తేదీ వరకు కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లతో పాటు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 97 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిని శనివారం సంబంధిత కోర్టుల్లో హాజరుపరచగా, న్యాయమూర్తి వీరికి భారీ జరిమానా విధించారు. మొత్తం 97 మందికి కలిపి రూ. 9 లక్షల 40 వేల జరిమానా విధించడమే కాకుండా, వీరిలో ముగ్గురికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ప్రకటనలో తెలిపారు. ప్రజలెవరూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన పత్రాలను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

# మోర్ఖండి గ్రామం లో ఘనంగా మాత రామాబాయి 128 అంబేద్కర్ జయంతి



**బజార్ హత్నూర్, ఫిబ్రవరి 07(డిడి9వార్త):-**బజార్ హత్నూర్ మండలం మోర్ఖండి గ్రామం లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ భీమ్రావ్ రాంజీ అంబేద్కర్ సతీమణి ఐన మాతా రమాబాయి 128 వ జయంతి వేడుకను ఘనంగా జరిపారు.ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం మాతా రామాబాయి చిత్రపటం వద్ద అందరు కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలోమోర్కండి గ్రామ అధ్యక్షులు కానిందే లక్ష్మణ్, గ్రామ సర్పంచ్ తొడసశీ నాందేవ్,ఉప సర్పంచ్ కానిందే సుదర్శన్,అంబేద్కర్ యూత్ ప్రెసి
డెంట్ కానిందే కేర్బ వైస్ ప్రెసిడెంట్ కాప్స్ సత్యపాల్, కార్యక్రమ నిర్వాహక అధ్యక్షుడు కానిందే జగదీశ్,లోవకారే,ప్రభు కాప్స్ దౌలత్,యువజన కాంగ్రెస్ మండల్ ప్రెసిడెంట్ కానిందే దినేష్ కుమార్,బౌరే ఆనంద్ రావు,ఏరేకర్ ఆనంద్ రావు,కాప్స్ శ్రీధర్, గ్రామ మహిళామణులు,యువకులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



**బోధన్, నిజామాబాద్ జిల్లా,07 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** సాలూర మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని శనివారం అధికారులు స్వయంగా పరిశీలించారు. సాలూర మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, హౌసింగ్ ఏఈలు గ్రామంలోని వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. లబ్ధిదారులు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. నిర్మాణాల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా చూడాలని, నిబంధనల ప్రకారం పనులు జరగాలని ఏఈని ఆదేశించారు. బిల్లుల చెల్లింపులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు వివరాలను నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గడువులోగా ఇండ్లు పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని కోరారు.

## నేడు క్రికెట్ క్రీడా పోటీలు అందరు ఆహ్వానితులే




**బజార్ హత్నూర్,ఫిబ్రవరి 07(డిడి9వార్త):-**బజార్ హత్నూర్ మండలంలోని క్రికెట్ క్రీడాప్రేమికులకు,అభిమానులకు నేడు అనగా తేదీ 8వ తేది ఆదివారం ఉదయం 12 గం.లకు బీపీల్ (బజార్ హత్నూర్ ప్రీమియర్ లీగ్) క్రికెట్ టోర్నమెంట్ను ప్రారంభించబడుతుందని కాన అందరు ఆహ్వానితులే, క్రీడాకారులు యువకులు హాజరు కావాలనిబీజేపీ నాయకుడుబీపీఎల్ రెండవ సేసన్ అధ్యక్షులు నానం రమణ మనవి చేశారు.ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథులుగా ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ ఆదిలాబాద్బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షులుపతంగే బ్రహ్మానంధ్,బీజేపి యువనాయకులు గోడం రిత్విక్,బీజేపీ నాయకులు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తాటిపెల్లి గంగాధర్ రావు, బీజేపీ సీనియర్ నాయకులు, రైల్వే బోర్డు ఎక్స్ సభ్యులు జీవీ రమణ,హాజరు అవుతారని కావున అందరూ హాజరు కావాలని అన్నారు.

## హరీశ్‌రావుకు నిరసన సెగ డౌన్ డౌన్ అంటూ హోరెత్తిన నినాదాలు

**సిద్దిపేట, ఫిబ్రవరి 7 :** గజ్వేల్ – ప్రజ్ఞాపూర్‌లోని ముంపు గ్రామాల్లో శనివారం మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి వెళ్లిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు( నిరసన సెగ తగిలింది. హరీశ్ రావు రాకముందే.. ఆర్ అండ్ ఆర్ కాలనీ ముంపు గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా నిరసనకారులు 'హరీశ్‌రావు డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. మరోవైపు బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా ప్రతి నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.ముంపు గ్రామాల బాధితులు, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య పోటా పోటీ నినాదాలు కొనసాగాయి. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారి, ఇరువర్గాలు ఒకరిపై ఒకరు చెప్పులు విసురుకోవడంతో స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. ఇరువర్గాలకు నచ్చుజెప్పే ప్రయత్నం చేశారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు స్వల్పంగా లాఠీఛార్జ్ చేయడంతో ఉద్రిక్తత కొంతమేర తగ్గింది. ఈ పరిణామాల నేపథ్యంలో హరీశ్‌రావు.. గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లోనే నిలిచిపోయినట్లు సమాచారం. ప్రస్తుతం అక్కడ భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## విజయశాంతి రెడ్డి సూసైడ్ కేసు అసలు నిజాన్ని బయటపెట్టిన పోలీసులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7:** హైదరాబాద్ శివారులోని చర్లపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన తల్లీపిల్లల సూసైడ్ కేసులో మిస్టరీ వీడింది. డిప్రెషన్‌తోనే విజయశాంతి రెడ్డి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసుల విచారణలో నిర్ధారణ అయింది. కొన్నాళ్లుగా ఆమె మానసిక ఒత్తిడితో బాధపడుతున్నట్టు గుర్తించారు. ఈ కేసుపై మరింత లోతుగా విచారణ చేపట్టారు పోలీసులు. మొదటి నుంచీ పిల్లలు తల్లి మాట తూచా తప్పకుండా పాటించేవారని తెలుస్తోంది. పిల్లలపై ఉన్న ఆ కంట్రోల్‌తోనే విజయశాంతి రెడ్డి వారిని వెంట తీసుకెళ్లారు.తల్లి ఏం చెప్పినా చేసేందుకు సిద్ధమైన పిల్లలు.. ఆమెతో కలిసి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ ఘటనలో రెండో ఫోన్ వాడారనే ప్రచారంలో నిజం లేదని పోలీసులు తెలిపారు. చనిపోవడానికి ముందు వారం రోజుల కాల్ డేటాపై విచారణ జరిపిన పోలీసులు.. ఎలాంటి అనుమానాస్పద అంశాలూ లభించలేదని తేల్చారు.కాగా.. జనవరి 30న రాత్రి చర్లపల్లి– ఘట్‌కేసర్ మధ్య రైల్వే ట్రాక్‌లపై సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని విజయ శాంతి రెడ్డి (38), ఆమె కుమార్తె చేతన రెడ్డి (18), కుమారుడు విశాల్ రెడ్డి (17)లు గూడ్స్ రైలు కింద పడి మృతి చెందారు. ఘటనా స్థలంలో విజయశాంతి రెడ్డి కారులో సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తనకు జీవించాలని లేదని, పిల్లలను ఒంటరిగా వదలి వెళ్లలేను.. అంటూ రాశారు. ఈ కేసు విచారణలో భాగంగా విజయ ఫోన్, ల్యాప్‌టాప్‌లను ఫోరెన్సిక్ అనాలిసిస్‌కు పంపించారు. చివరకు డిప్రెషన్‌తోనే ఆమె తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

## లోన్ యాప్స్ కిరాతకం ఐదు నెలల్లో రూ.36 లక్షల అధిక వసూలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7:** నేటి డిజిటల్ యుగంలో 'తక్షణ రుణం' అంటూ సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు. సామాన్యుల పాలిట మృత్యుపాశాలుగా మారుతున్నాయి. తాజాగా హైదరాబాద్‌లోని సనత్ నగర్‌కు చెందిన ఒక వ్యక్తి, అక్రమ లోన్ యాప్‌ల వేధింపులు తాళలేక ఏకంగా రూ.36.16 లక్షలు పోగొట్టుకున్న ఘటన కలకలం రేపుతోంది.అసలేం జరిగింది?బాధితుడు 2025 ఆగస్టులో గూగుల్ ప్లే స్టోర్ నుంచి 'లోన్ రాడార్', 'క్విక్ ఫండ్స్' అనే యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. మొదట్లో చిన్న మొత్తంలో రుణం తీసుకున్న ఆయన.. దానిని సకాలంలో తిరిగి చెల్లించాడు. బాధితుడి నిజాయతీని ఆసరాగా చేసుకున్న ఆయా లోన్ యాప్‌ల నిర్వాహకులు.. అసలు అడగకుండానే ఆయన ఖాతాలోకి భారీ మొత్తంలో డబ్బులు జమ చేయడం ప్రారంభించారు.వేధింపుల పర్వం.. 6వ రోజు నుంచే నరకం7 రోజుల గడువు అని చెప్పి, 6వ రోజు నుంచే లోన్ యాప్ నిర్వాహకులు అసలు స్వరూపాన్ని బయటపెట్టారు. యాప్ ద్వారా అతని పర్సనల్ డేటా చోరీ చేశారు. సదరు లోన్ యాప్స్ డౌన్లోడ్ చేసే సమయంలో బాధితుడి అనుమతితో కాంటాక్ట్ లిస్ట్, గ్యాలరీని యాక్సెస్ చేసుకున్నారు.మార్ఫింగ్ మాయాజాలం.. బ్లాక్ మెయిలింగ్బాధితుడి ఫోన్ నుంచి ఫొటోలను సేకరించి, వాటిని అశ్లీల చిత్రాలుగా మార్చారు. డబ్బులు కట్టకపోతే ఆ అశ్లీల చిత్రాలను.. అతడి బంధువులు, స్నేహితులకు పంపిస్తామని బెదిరింపులకు దిగారు.

## రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రావడం ఖాయం బీఆర్ఎస్ నాయకుడు రవికుమార్

**కోటగిరి, ఫిబ్రవరి 7 :** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్ల కాలంలో తెలంగాణ ప్రజలు విసుగెత్తిపోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వమని చేతల ప్రభుత్వం కాదని వచ్చి రెండేళ్లలో కేసీఆర్ కేటీఆర్ నాయకత్వంలో తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం రావడం ఖాయమని బీఆర్ఎస్ పార్టీ కోటగిరి మండల నాయకులు తెల్ల రవికుమార్ అన్నారు.

కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సభకు కోటగిరి మండలం నుండి బైక్ ర్యాలీతో శనివారం తరలి వెళ్ళారు. ఈ సందర్భంగా తేళ్ల రవికుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరిచ్చిందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీకి విశేష స్పందన వస్తుందన్నారు.మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమన్నారు. బహిరంగ సభకు తరలిన వెళ్లిన వారిలో కప్ప సంతోష్, గంగా ప్రసాద్ గౌడ్, శంకర్ గౌడ్, జలాల్, దేవేందర్, ఏత్తొండ మాజీ ఎంపిటిసి ఫారూఖ్దితరులు ఉన్నారు.

## లక్ష్యం జీతం కాదు.. జీవితం కావాలి

– ప్రముఖ వక్త భారతీయం సత్యవాణి
– ఘనంగా శ్రీ విజయసాయి ఉన్నత పాఠశాల వార్షికోత్సవం, వీడ్కోలు సభ








**బోధన్, నిజామాబాద్ జిల్లా,07 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** విద్యార్థులు విద్యను కేవలం ధనార్జన కోసం లేదా జీతం కోసం అభ్యసించకుండా, ఒక పరిపూర్ణమైన జీవితాన్ని నిర్మించు కోవడానికి పునాదిగా మార్చుకోవాలని ప్రముఖ వక్త భారతీయం సత్యవాణి ఉద్ఘాటించారు. బోధన్ పట్టణంలోని శ్రీ విజయసాయి ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం పాఠశాల వార్షికోత్సవం మరియు పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సత్యవాణి గారు మాట్లాడుతూ.. భారతదేశం అనాదిగా ప్రపంచానికి సంస్కృతి, సంప్రదాయాలను మరియు నైతిక విలువలను నేర్పిన దేశమని, ఆ వారసత్వాన్ని నేటి తరం విద్యార్థులు తమ గుండెల్లో నింపుకోవాలని కోరారు. ఆధునికత వైపు వెళ్తూనే మన మూలాలను మర్చిపోకూడదని హితవు పలికారు. తల్లిదండ్రులను ఉద్దేశించి ఆమె పలు కీలక సూచనలు చేశారు. పిల్లలను పక్కన ఉన్న వారితో పోల్చి వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయకండి. ప్రతి బిడ్డలో ఒక ప్రత్యేకమైన సృజనాత్మకత ఉంటుంది. వారి అభిరుచులను గుర్తించి, వారు ఇష్టపడే రంగంలో రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రస్తుత కాలంలో బయట దొరికే జంక్ ఫుడ్ (చిరుతిండ్లు) వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కొన్ని రకాల ఆహార పదార్థాలలో మత్తు కారకాలు కలుపుతున్నారని, వాటికి బానిసలై భవిష్యత్తును పాడుచేసుకోవద్దని విద్యార్థులను హెచ్చరించారు. ప్రతి విద్యార్థి ఝాన్సీ లక్ష్మీబాయి లాంటి ధైర్యాన్ని, స్వామి వివేకానందుడి లాంటి మేధస్సును పెంపొందించుకుని దేశానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపల్ వా. కృష్ణమోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ప్రదర్శించిన జానపద మరియు శాస్త్రీయ నృత్యాలు ఆహూతులను అలరించాయి. పదో తరగతి విద్యార్థులు తమ పాఠశాల అనుభవాలను పంచుకుంటూ ఉద్వేగానికి లోనయ్యారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సత్యవాణి గారి చేతుల మీదుగా బహుమతుల ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమంలో పి.ఆర్.ఓ. ఐ.ఆర్. చక్రవర్తి, ప్రైమరీ ఇన్చార్జి ప్రసూన, అకాడమిక్ ఇన్చార్జి సువర్చల, వివిధ విభాగాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పశుసంపద పరిరక్షణే లక్ష్యంగా సేవా శిబిరాలు

**పివిఎన్ఆర్టీవియు ఉపకులపతి ప్రొఫెసర్ ఎం.జ్ఞాన ప్రకాష్**
**ఘనంగా పశు ఆరోగ్య శిబిరాల ముగింపు వేడుక**












**బోధన్, నిజామాబాద్ జిల్లా,07 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పశుసంపదే కీలకమని, వాటి ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో పశువైద్య విద్యార్థులు, శాస్త్రవేత్తలు నిరంతరం కృషి చేయాలని పి.వి.నరసింహారావు తెలంగాణ రాష్ట్ర వెటర్నరీ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జ్ఞాన ప్రకాష్ పిలుపునిచ్చారు. లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320, కోరుట్ల వెటర్నరీ సైన్స్ కళాశాల మరియు నిజామాబాద్ జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ జంతు ఆరోగ్య శిబిరాల ముగింపు వేడుక బోధన్ లయన్స్ కాన్ఫరెన్స్ హల్ లో శనివారం ఘనంగా జరిగింది.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వి.సి. మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవలో పాలుపంచుకోవడం అభినందనీయమని కొనియాడారు. క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి పశువులకు వైద్య సేవలందించడం వల్ల విద్యార్థులకు వృత్తిపరమైన నైపుణ్యం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. లయన్స్ క్లబ్ వంటి స్వచ్ఛంద సంస్థలు పశువైద్య కళాశాలలతో కలిసి పని చేయడం వల్ల మారుమూల ప్రాంతాల్లోని రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. లయన్స్ జిల్లా గవర్నర్ లయన్ అమరనాథ్ రావు మాట్లాడుతూ.. తమ జిల్లా వ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ ఆరోగ్య శిబిరాలను నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా శిబిరాల్లో అత్యుత్తమ సేవలు అందించిన విద్యార్థులకు, సమన్వయకర్తలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ వేడుకలో ప్రత్యేక అతిథులుగా హన్మంత రావు, బి. బసవేశ్వర రావు, డాక్టర్ దాసరి శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు చంద్రారెడ్డి, డాక్టర్ శ్రవణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పశువైద్య కళాశాల అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేశారు.

## నాంపల్లి అగ్నిప్రమాదం డీసీపీ స్పందన



**హైదరాబాద్, ఫిబ్రవరి 7 :** హైదరాబాద్ నగరంలోని నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో శనివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ల్యాబ్ భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో కీలక పత్రాలు మంటల్లో కాలిపోయినట్లు సమాచారం. అయితే ఈ అగ్నిప్రమాదానికి సంబంధించి.. హైదరాబాద్ పోలీస్ సెంట్రల్ జోన్ డీసీపీ కె.శిల్పవల్లిమీడియాకు వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చాయని ఆమె తెలిపారు.ఈ ల్యాబ్ నుంచే నేరపరిశోధన.ఉదయం 10:00 గంటలకు అగ్ని ప్రమాదంపై సమాచారం అందిందని డీసీపీ శిల్పవల్లి వివరించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగిందని చెప్పుకొచ్చారు. నేర పరిశోధనకు సంబంధించిన ఫైల్స్, ఎవిడెన్స్‌కు సంబంధించి ఈ ల్యాబ్ నుంచే ఆపరేషన్ జరుగుతుందని తెలిపారు. మంటల్లో కీలక ఫైల్స్ కాలిపోయిన విషయంపై ఇంకా స్పష్టత లేదన్నారు. మొదటి అంతస్తులో కంప్యూటర్స్ ఉంటాయని ఆమె వెల్లడించారు.మంటలను పూర్తిగా అదుపు చేశాం..5 ఫైర్ ఇంజిన్‌ల సాయంతో మంటలను పూర్తిగా అదుపు చేశామని డీసీపీ తెలిపారు. ఈ కార్యాలయంలో పనిచేస్తున్న ఆఫీస్ బాయ్ మంటలను గమనించి సమాచారం అందించారని వివరించారు. ఆఫీస్ బాయ్ గమనించి వెంటనే మంటలార్పే ప్రయత్నం చేశారని అన్నారు. ఈ క్రమంలో అతను అస్వస్థతకు లోనయ్యారని.. వెంటనే 108లో ఆస్పత్రికి తరలించామని డీసీపీ తెలిపారు. ఈ ప్రమాదం జరిగినప్పుడు నలుగురు ఉద్యోగులు లోపలే ఉన్నారన్నారు. మంటలు గమనించి వారు సురక్షితంగా బయటపడ్డారని ఆమె చెప్పారు.విలువైన హార్డ్ డిస్కులు అగ్నికి ఆహుతి: డీఎఫ్ఓ శ్రీ దాస్తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో మంటలు అదుపులోకి వచ్చాయని డీఎఫ్ఓ శ్రీ దాస్ తెలిపారు. మొదటి అంతస్తులోని వివిధ కేసులకు సంబంధించిన సీజ్ ప్రాపర్టీ విభాగంలో అగ్నిప్రమాదం సంభవించిందన్నారు. చాలా విలువైన హార్డ్ డిస్కులు, డాక్యుమెంట్స్ అగ్నికి ఆహుతయ్యాయని వివరించారు. ఇవాళ ఉదయం 10:22 గంటలకు అగ్నిప్రమాదం గురించి సమాచారం అందిందని ఆయన అన్నారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నామని.. అప్పటికే మంటలు ఎగసి పడుతున్నాయని తెలిపారు. కెమికల్ ల్యాబ్ మెటీరియల్ మొత్తం రెండో అంతస్తులో ఉందని చెప్పుకొచ్చారు. అయితే రెండో అంతస్తుకు మంటలు వ్యాపించలేదన్నారు. మొదటి అంతస్తులో సెన్సిటివ్‌గా ఉన్న ప్లాస్టిక్ వస్తువుల కాలిపోయాయని వివరించారు.హార్డ్ డిస్కులు పూర్తిగా కాలిపోయాయా? పాక్షికంగా కాలాయా? అన్నది పరిశీలించాలని

## హైదరాబాద్‌కు దీటుగా మెగా సిటీ కారిడార్ రేవంత్ సర్కార్ పెంటాసిటీ మాస్టర్ ప్లాన్ ఆ 5 నగరాలను కలుపుతూ




**హైదరాబాద్, ఫిబ్రవరి 7 :** తెలంగాణలో అభివృద్ధి అంతా హైదరాబాద్ చుట్టూనే కేంద్రీకృతమై ఉంది. ఇది కాదనలేని సత్యం. తెలంగాణ వ్యాప్తంగా డెవలప్‌మెంట్ జరగాలంటే నగరాలను విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హైదరాబాద్ తర్వాత అతి పెద్ద నగరాలుగా వరంగల్, కరీంనగర్ పట్టణాలు నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి సరికొత్త, వినూత్నమైన విజన్‌ను ఆవిష్కరించారు. ఇప్పటికే 'ఫ్యూచర్ సిటీ' పేరుతో హైదరాబాద్ రూపురేఖలను మారుస్తున్న ప్రభుత్వం.. తాజాగా వరంగల్ ట్రై సిటీలు– హుజూర్‌నగర్, కరీంనగర్ నగరాలను కలిపి 'పంచనగరి' (ౖావత్ఖుఎఠ్ఎ )గా తీర్చిదిద్దే బృహత్తర సంకల్పం తీసుకుంది. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. కరీంనగర్ జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్ చేసిన ప్రకటన ఉత్తర తెలంగాణ భవిష్యత్తును మార్చే ఒక మాస్టర్ ప్లాన్‌లా కనిపిస్తోంది.ప్రస్తుతం హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలుగా ఉండగా.. సైబరాబాద్‌తో కలిపి అది ట్రై సిటీగా మారింది. ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీ పూర్తయితే అది క్వాడ్ సిటీ అవుతుంది. అయితే, ఉత్తర తెలంగాణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని వరంగల్, హన్మకొండ, కాజీపేట (త్రినగరి) ప్రాంతాలను కరీంనగర్, హుజూరాబాద్‌లతో అనుసంధానిస్తూ ఒకే 'సిటీ బెల్ట్'గా మార్చాలని రేవంత్ ప్లాన్ చేస్తున్నారు. ఇదే రేవంత్ రెడ్డి కలలుగంటున్న 'పంచనగరి'.అభివృద్ధే ధ్యేయంగా.హైదరాబాద్ నగరంపై విపరీతమైన ఒత్తిడిని తగ్గించి, ఉపాధిని వికేంద్రీకరించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది. ఈ కారిడార్‌లో వరంగల్, కరీంనగర్ నగరాల వెలుపల రింగ్ రోడ్లను () నిర్మించి, వాటిని అనుసంధానించడం ద్వారా రవాణా వేగవంతం చేయటం లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండు నగరాల మధ్య భారీ ఇంటిగ్రేటెడ్ డంప్ యార్డ్‌ను ఏర్పాటు చేసి, బయో వేస్ట్ పవర్ ప్లాంట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడం, ఐటీ సెక్టార్ హబ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు, ఇతర ఉపాధి మార్గాలకు ఈ ప్రాంతాన్ని కేంద్రంగా మార్చటం లక్ష్యంగా పెట్టుకున్నారు. వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయం పూర్తి చేయడం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటు ఈ ప్రాజెక్టులో కీలకంగా మారనున్నాయి.రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను రేవంత్ రెడ్డి మూడు మండలాలుగా విభజించారు. : హైదరాబాద్ లోపల ఉండే కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ, , ప్రతిపాదిత ప్రాంతీయ రింగ్ రోడ్ మధ్య ఉన్న తయారీ రంగం. =ూ=జు: రీజినల్ రింగు రోడ్డుకు అవల ఉండే వ్యవసాయ అనుబంధ రంగాల ప్రాంతం. ఈ విభజనలో వరంగల్–కరీంనగర్ కారిడార్ తెలంగాణకు మరో హైదరాబాద్‌లా నిలవనుంది. తెలంగాణ అభివృద్ధి అంటే కేవలం హైదరాబాద్ మాత్రమే కాకుండా.. టైర్–2 నగరాలను ఆర్థికంగా బలోపేతం చేయడం ద్వారా సమతుల్య అభివృద్ధి సాధ్యవ ంవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. వరంగల్ ఇప్పటికే విద్యా కేంద్రంగా ఉంది. దానికి కరీంనగర్ పారిశ్రామిక శక్తి తోడైతే ఉత్తర తెలంగాణ ఒక శక్తివంతమైన గ్రోత్ ఇంజిన్‌గా మారు నుంది. స్థానిక యువతకు ఉపాధి లభించడమే కాకుండా, ఎస్టేట్, వ్యాపార రంగాలు కొత్త పుంతలు తొక్కే ఛాన్స్ ఉంది.